సాక్షి ప్రకాశం

బుధవారం, 9, అక్టోబర్, 2024



పేదల గూటి ఘోష..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా ఇంత వరకు పేదల ఇళ్ల నిర్మాణాలపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

- IIలో..



మద్యం దుకాణాలకు 1472 దరఖాస్తులు

జిల్లాలో 171 మద్యం దుకాణాలకు ఇప్పటి వరకు 1472 దరఖాస్తులు వచ్చాయి.

- IIలో..

గరిష్టం/కనిష్టం
35.6/27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ పెంపొందేలా బోధన

● కలెక్టర్ తమీమ్ అన్సారియా




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: కేంద్రీయ విద్యాలయంలోని విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు జనరల్ నాలెడ్జ్ పెంపొందేలా బోధన ఉండాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. ఒంగోలు కేంద్రీయ విద్యాలయంలో మంగళవారం మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. కేంద్రీయ విద్యాలయం పరిస్థితి, 2024–25 సెషన్ కోసం అడ్మిషన్ మార్గదర్శకాలు, తరగతుల వారీగా విద్యార్థుల నమోదు, సిబ్బంది మంజూరు, ఖాళీ పోస్టుల వివరాలు, గత కమిటీ సమావేశం అజెండా వివరాలు, తీసుకున్న చర్యలు, ప్రస్తుత కమిటీ సమావేశం అజెండా వివరాలను ప్రిన్సిపాల్ ఎం.మనీష్‌కుమార్ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ క్రమం తప్పకుండా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు విద్యార్థుల్లో గ్రూప్ యాక్టివిటీస్ ను పెంపొందించాలన్నారు. పిల్లల్లో సృజనాత్మకతను గుర్తించి అందుకనుగుణంగా బోధన ఉండాలని సూచించారు. పాఠశాల పక్కనే అందుబాటులో ఉన్న ప్లే గ్రౌండ్ కోసం భూమి కేటాయింపు విషయం పరిశీలిస్తామని తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు స్టెప్ సీఈఓ లోకేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సురేష్‌కుమార్, ఒంగోలు రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ ప్రకాష్‌బాబు, జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, ఒంగోలు కేంద్రీయ విద్యాలయం రిటైర్డు ప్రిన్సిపాల్ సూర్యప్రకాష్‌రావు, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీర్ పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

అటు పోస్టింగ్.. ఇటు పెండింగ్

కూటమిలో బదిలీ చిచ్చు.. **డీఎంహెచ్ఓ పోస్టింగ్‌లో మంత్రుల మధ్య సిగపట్లు**



టీడీపీ, జనసేన, బీజేపీ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే నేతల మధ్య ఆధిపత్యపోరు మొదలైంది. అధికార బదిలీల్లో ఒకరు సిఫారసు చేస్తే దానికి మరొకరు అడ్డుపుల్ల వేస్తున్నారు. కూటమిలో భాగస్వాములుగా ఉన్న మా సిఫారసులు చెల్లుబాటుకాకపోవడంపై మనస్తాపానికి గురవుతున్నారు. ఇప్పుడే మా మాట చెల్లుబాటు కాకపోతే ఎలా అంటూ జనసేన మంత్రులు, ప్రజాప్రతినిధులు రగిలిపోతున్నారు. జిల్లాలో వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారి బదిలీ వ్యవహారం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. జనసేనకు చెందిన మంత్రి ఒకరు వైద్యాధికారికి సిఫారసు చేస్తే దానిని ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో మంత్రులు జోక్యం చేసుకున్నారు. సదరు అధికారి రాకుండా ఉన్నత స్థాయిలో అడ్డుకున్నారు. కూటమిలో ఎంతో కీలకంగా ఉన్న తన సిఫారసునే నిలిపివేస్తే ఎలా అంటూ సదరు మంత్రి తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేసినట్టు సమాచారం.

- ● జనసేన మంత్రి పోస్టింగ్ వేయిస్తే అడ్డుకున్న టీడీపీ
- ● ఉత్తర్వులు ఇచ్చిన కొద్దిసేపటికే పెండింగ్‌లో పెట్టిన వైనం
- ● కౌన్సెలింగ్‌కు ముందే బదిలీ ఉత్తర్వులు ఇవ్వడంపై అభ్యంతరం
- ● మా జిల్లాలో మీ పెత్తనం ఏంటని టీడీపీ మంత్రుల నిలదీత
- ● బదిలీ కూడా చేయించుకునే అధికారం లేకపోతే మంత్రి పదవెందుకని ఆవేదన
- ● టీడీపీ పెత్తనాన్ని సహించమంటున్న జనసైనికులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లా స్థాయి అధికారుల బదిలీల్లో ఒకరు ఎడ్డెమంటే మరొకరు తెడ్డెమంటున్నారు. ఒకరు అవునంటే మరొకరు కాదంటున్నారు. మొత్తం మీద జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి బదిలీ వ్యవహారం తెలుగు దేశం, జనసేన పార్టీల్లో చిచ్చు పెట్టింది. కూటమిలోని ఒక మంత్రి పోస్టింగ్ ఇప్పిస్తే మరొక మంత్రి ఆఘమేఘాల మీద బదిలీ నిలిపి వేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. మా నియోజకవర్గంలో జోక్యం చేసుకోవడం మంచిది కాదని టీడీపీ నాయకులు సున్నితంగా హెచ్చరిస్తుండగా, ఆ మాత్రం అధికారం లేకపోతే మంత్రి పదవెందుకు అంటూ జనసేన మంత్రి చిరాకు పడుతున్నారు. మా అంగీకారం లేకుండా బాధ్యతలు చేపడితే ఉద్యోగం ఎలా చేస్తారో మేమూ చూస్తామంటూ జిల్లాకు చెందిన మంత్రులు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చెబుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

డీఎంహెచ్ఓ పోస్టింగ్‌పై తకరారు..

జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిగా పనిచేస్తున్న రాజ్యలక్ష్మి గత ఏప్రిల్‌లో రిటైర్డ్ అయ్యారు. దాంతో జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్‌కు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. ఆరు నెలలుగా ఆయన విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్ని శాఖలలోనూ బదిలీలు చేపట్టింది. వైద్యారోగ్య శాఖలో ఇంకా బదిలీల ప్రక్రియ జరగలేదు. మరో రెండు మూడు రోజుల్లో కౌన్సిలింగ్ జరుగుతుందని సమాచారం. ఈ లోపే జిల్లా డీఎంహెచ్ఓగా పి.రత్నావళిని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. రత్నావళి 2020 నుంచి 2022 వరకు ఇక్కడ డీఎంహెచ్ఓగా పనిచేశారు. కోవిడ్ సమయంలో వైద్యశాఖలో పెద్ద ఎత్తున చేపట్టిన నియామకాల్లో ఆమె అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆ క్రమంలో ఆమెను డైరెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేశారు. అప్పుడు జరిగిన అక్రమాలపై ఇప్పటికీ విచారణ కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం ఆమె విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

టీడీపీ మంత్రుల అభ్యంతరం...

డీఎంహెచ్ఓ బదిలీ విషయం తెలుసుకొని ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన మంత్రులు ఉలిక్కిపడ్డారు. తమకు తెలియకుండా పోస్టింగ్ ఇచ్చే అవకాశం లేదని భావిస్తున్న వారిద్దరూ రత్నావళి వ్యవహారంపై షాక్‌కు గురయ్యారని తెలుస్తోంది. తమకు కనీసం సమాచారం ఇవ్వకుండా ఒక జిల్లా అధికారికి ఎలా పోస్టింగ్ ఇస్తారంటూ సంబంధిత శాఖ అధికారులపై మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. మా జిల్లాలో జోక్యం చేసుకోవడానికి ఆయనెవరు అంటూ జనసేన మంత్రిపై పరోక్షంగా విమర్శలు చేయడమే కాకుండా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. వీరికి తోడు ఒంగోలు ఎమ్మెల్యే సైతం నారా లోకేష్‌కు ఫీడ్‌బ్యాక్ పంపినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో ప్రస్తుతానికి రత్నావళి బదిలీని నిలిపేయమని ఆయన ఆదేశించినట్లు చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఇరుపార్టీల మధ్య మాటలు నడిచినట్లు చెప్పుకుంటున్నారు.

అధికారం లేకుండా మంత్రి పదవి ఎందుకు...

రత్నావళి బదిలీ వ్యవహారంలో కూటమిలోని తెలుగుదేశం పార్టీ, జనసేన నాయకుల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. పొరుగు జిల్లాకు చెందిన మంత్రి తమ జిల్లాకు సంబంధించిన అధికారి పోస్టింగ్ వ్యవహారంలో కల్పించుకోవడం పద్ధతి కాదని టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. జనసేన త్యాగాలతో కూటమి విజయం సాధించి టీడీపీ అధికారంలోకి వచ్చిందని, రాష్ట్రంలో ఒక జిల్లా అధికారిని కూడా బదిలీ చేయించుకునే స్వేచ్ఛ లేకపోతే మంత్రి పదవి మాత్రం ఎందుకని సన్నిహితుల దగ్గర సదరు మంత్రి వాపోయినట్టు సమాచారం. ఇరు పార్టీలకు చెందిన మంత్రులు కూడా డీఎంహెచ్ఓ పోస్టింగ్ విషయం పట్టుదలకు పోతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా టీడీపీ మంత్రులు కొత్తపేరును తెరపైకి తెచ్చినట్టు సమాచారం. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఒక మంత్రికి అత్యంత సన్నిహితుడుగా ఉన్న అధికారికి పోస్టింగ్ ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికే ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని జనసేన మంత్రి అధికారులను ఆదేశించడం వివాదంగా మారింది. ఇదిలా ఉండగా అద్దంకి ప్రాంతానికి చెందిన ఆయన ప్రస్తుతం బాపట్ల జిల్లాలో పనిచేస్తున్నారు. ఆయన జిల్లాకు చెందిన తెలుగుదేశం ఎమ్మెల్యేలను సైతం కలిసి తనకు సహకరించాలని కోరినట్టు వైద్య ఆరోగ్య శాఖలో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతానికి రత్నావళి నియామక ఉత్తర్వులు రద్దు చేసినట్లు ఎలాంటి సమాచారం లేదు. కేవలం పెండింగ్‌లో మాత్రమే ఉంచినట్లు తెలుస్తోంది. రత్నావళి కూడా తనకున్న పరిచయాల ద్వారా కమిషనరేట్‌లో పావులు కదుపుతున్న చెప్పుకుంటున్నారు. మొత్తం మీద ఈ బదిలీ వ్యవహారం అధికార కూటమిలో చిచ్చురేగడంతో భవిష్యత్ పరిణామాలు ఎలా ఉంటాయోనని వైద్యారోగ్యశాఖలో అధికారులు, ఉద్యోగులు ఉత్సుకతతో ఎదురుచూస్తున్నారు.

బదిలీ వెనక ఉన్నది ఎవరు...

విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న రత్నావళికి కృష్ణా జిల్లాకు చెందిన జనసేన నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభానుతో పరిచయాలున్నాయి. ఆయన ద్వారా జనసేనలో నంబర్ టూగా వ్యవహరిస్తున్న మంత్రి వైద్యశాఖ అధికారులతో మాట్లాడి రత్నావళికి పోస్టింగు ఇప్పించినట్లు ప్రచారం జరుగుతోంది. దీనికి సంబంధించి చీఫ్ స్పెషల్ సెక్రటరీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆదేశాలు ఇలా వచ్చాయో లేదో వెంటనే ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని టీడీపీకి చెందిన ఇద్దరు మంత్రులు రంగంలోకి దిగారు.

వెలుగొండతోనే కరువు తీరేది

- ● ప్రాజెక్టును సత్వరం పూర్తిచేయాలన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- ● మెరుగైన ఆర్అర్ ప్యాకేజీ ఇవ్వకుంటే ఉద్యమిస్తామన్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్
- ● వెలుగొండపై సీపీఐ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

మార్కాపురం: పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టును సత్వరం పూర్తి చేసి నీరు విడుదల చేయడం ద్వారానే జిల్లాలో కరువు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ అన్నారు. మార్కాపురంలోని ప్రెస్ క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మాణ పనులకు తక్షణమే రూ.2 వేల కోట్లను బడ్జెట్‌లో కేటాయించి ఇవ్వాలని ఆయన కోరారు. దీని వలన ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 32 మండలాల్లో 4.50 లక్షల ఎకరాలకు సాగునీరు, 16 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందుతుందని అన్నారు. దేశంలోనే అతి తక్కువ నిధులతో ఇన్ని లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టు ఎక్కడా లేదన్నారు. వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులు డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పురోగమనంలో పయనించాయని అన్నారు. రూ.2 వేల కోట్ల నిధులు కేటాయిస్తే ప్రాజెక్టు పూర్తవుతుందని చెప్పారు. మార్కాపురాన్ని జిల్లా చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం దసరా పండుగ అనంతరం సీఎంను కలిసి వినతిపత్రం అందిస్తామని చెప్పారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జీ ఈశ్వరయ్య, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి టీవీఎస్ స్వామి, నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి అందె నాసరయ్య, ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే వీరారెడ్డి, సీపీఐ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, కృష్ణగౌడ్, ఎస్‌కే ఖాశీం, పెద్దన్న, సీపీఎం పట్టణ కార్యదర్శి సోమయ్య, నెల్లూరు జిల్లా ఉదయగిరి ఏరియా సీపీఐ నాయకులు మాలకొండారెడ్డి, డాక్టర్ శ్యామ్ ప్రసాద్, డీకేఎం రఫీ, అల్లూరయ్య తదితరులు పాల్గొన్నారు.

■ ముంపు గ్రామాల ప్రజలకు ప్రభుత్వం తక్షణమే ఆర్అర్ ప్యాకేజీ ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలను తక్షణమే కల్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ మెరుగైన ఆర్అర్ ప్యాకేజీ ఇవ్వాలని ఆయన కోరారు.

■ వెలుగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్ల నిధులు కేటాయించాలని కోరుతూ ప్రాజెక్టు పరిధిలోని మండల కేంద్రాల్లో ఉన్న తహశీల్దార్ కార్యాలయాల్లో ఆయా నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ విజ్ఞప్తి చేశారు. నవంబరు 18వ తేదీ కలెక్టర్ కార్యాలయంలో ముంపు గ్రామాల బాధితులతో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

■ వెలుగొండ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి నిధులు కేటాయించడంతోపాటు నికర జలాలు కేటాయించాలని ఆమ్‌ఆద్మీపార్టీ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

■ వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపునకు గురవుతున్న గొట్టిపడియ, అక్కచెరువుతాండ, సుంకేశుల, కలనూతల, మాగుటూరు తాండ తదితర ముంపు గ్రామాల నిర్వాసితులకు ప్రభుత్వం మెరుగైన ఆర్అర్ ప్యాకేజీ ఇచ్చి ఆదుకోవడంతోపాటు పునరావాస కాలనీల్లో వెంటనే పనులు పూర్తిచేయాలని ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రజాక్ విజ్ఞప్తి చేశారు.

■ వెలుగొండ ప్రాజెక్టుతోనే పశ్చిమ ప్రకాశంలో వలసలను నివారించవచ్చని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా అన్నారు.

■ వెలుగొండ ప్రాజెక్టు కోసం సీపీఎం ముందుండి ఉద్యమాలు చేస్తుందని జిల్లా సీపీఎం కార్యదర్శి సయ్యద్ అనీఫ్ తెలిపారు.

కాత్యాయనీ నమోస్తుతే..

● కాత్యాయని అలంకారంలో సింహ వాహనంపై బాలా త్రిపురసుందరీదేవి



త్రిపురాంతకం శ్రీబాలాత్రిపురసుందరీదేవి కాత్యాయని అలంకారంలో సింహ వాహనసేవ

త్రిపురాంతకం: దసరా నవరాత్రుల సందర్భంగా జిల్లాలోని ప్రముఖ శక్తి క్షేత్రం త్రిపురాంతకంలో బాలా త్రిపురసుందరీదేవి అమ్మవారు మంగళవారం కాత్యాయని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి సింహ వాహనన సేవ వైభవంగా జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం మూల నక్షత్రం సందర్భంగా కాళరాత్రి అలంకారంలో గజవాహనంపై అమ్మవారు దర్శనం ఇవ్వనున్నారు.

రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి

● మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి



వర్క్‌షాప్ లో పాల్గొన్న మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంట, కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: స్వర్ణాంధ్ర–2047 ఏపీ విజన్ అజెండాతో రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భగస్వాములు కావాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. మంగళవారం స్వర్ణాంధ్ర–2047 విజన్ రూపకల్పనలో భాగంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌హాల్లో మంత్రి, శాసనసభ్యులతో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2047 నాటికి స్వాతంత్ర్యం వచ్చి వంద సంవత్సరాలు పూర్తయ్యే నాటికి భారతదేశం పూర్తిగా అభివృద్ధి చెంది ఉండాలన్న లక్ష్యంతో వికసిత్ భారత్ పేరుతో అన్నీ రంగాలను అభివృద్ధి చేసేలా 2047 కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాకు సంబంధించి విజన్ డాక్యుమెంట్ తయారు చేయడానికి శాఖల వారీగా రెండు నెలల నుంచి శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. జిల్లా అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అన్నీ రంగాల ప్రజలను భాగస్వాములు చేసి అందరి సలహాలు, సూచనలు తీసుకుంటామన్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ వెనుకబడిన ప్రకాశం జిల్లా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. సీ.ఎస్.ఆర్ నిధులను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధ శాఖలు రూపొందించిన విజన్ డాక్యుమెంట్‌ను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దనరావు, ముత్తుముల అశోక్‌రెడ్డి, కందుల నారాయణరెడ్డి, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత, ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు డీఎస్సీ శిక్షణ

ఒంగోలు సిటీ: ఏపీ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖలు సంయుక్తంగా 5050 ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీ శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, సాధికారత అధికారి ఎన్.లక్ష్మానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపానల్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకునే శిక్షణ సంస్థలు కనీసం రెండు డీఎస్సీ రిక్రూట్‌మెంట్లకు కోచింగ్ ఇచ్చి ఉండాలన్నారు. ఇతర వివరాల కోసం ఈఓఐ డాక్యుమెంట్ ను ఏపీ ఈ–ప్రొక్యూర్‌మెంట్ నుంచి ఈ నెల 7వ తేదీ నుంచి డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుకు ఈ నెల 21వ తేదీ తుది గడువు.

గుర్తించిన పనులన్నీ ప్రారంభించేలా చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, అధికారులు

● కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: గ్రామసభలో గుర్తించిన పనులన్నింటినీ వచ్చేవారం 'పల్లె పండుగ' కార్యక్రమంలో పూర్తిస్థాయిలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా చెప్పారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అమరావతి సచివాలయం నుంచి మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో చేపట్టే పనుల వివరాలను వివరించారు. 972 పనులకు పరిపాలన అనుమతులు ఇచ్చామని, 928 పనులకు సాంకేతిక అనుమతులు లభించాయని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలకు కూడా సాంకేతిక అనుమతులు లభిస్తే వాటిని చేపడతామన్నారు. నిర్మాణ పనులు చేపట్టడానికి ఇసుక పరంగా సమస్యలు లేవని, సిమెంట్ సరఫరా సకాలంలో జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షిస్తే జనవరి నాటికి ఈ పనులన్నీ పూర్తయ్యేలా చూస్తామని తెలిపారు. పనులన్నీ చేపట్టడానికి స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ఇప్పటికే ప్రణాళిక రూపొందించామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ జోసఫ్ కుమార్, డీపీవో ఉషారాణి, జెడ్పీ సీఈఓ చిరంజీవి, పంచాయతీ రాజ్ అధికారులు పాల్గొన్నారు.

క్రీడాకారిణి మైథిలి మృతి కేసులో ముగ్గురు సస్పెన్షన్

ఒంగోలు: ఫుట్‌బాల్ క్రీడాకారిణి మైథిలి మృతికి సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ ముగ్గురిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. క్రీడాపోటీల నుంచి తిరిగి ఇంటికి చేరే క్రమంలో మైథిలిని తల్లిదండ్రులకు అప్పగించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొంటూ పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం అవుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మార్కాపురం ఉప విద్యాశాఖ అధికారిని విచారణ అధికారిగా వేయగా ఆయన ఇచ్చిన రిపోర్టు మేరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కె.వనజ, విద్యార్థిని విద్యనభ్యసిస్తున్న ముండ్లమూరువారిపాలెం హైస్కూలు హెడ్మాస్టర్ శివరామకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ జి.శ్రీదేవిలను సస్పెండ్ చేశారు. ఇక సమగ్రశిక్ష నుంచి అవుట్ సోర్సింగ్‌లో వ్యాయామ ఉపాధ్యాయునిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రోజర్ బిన్నిపై చర్యలకు కలెక్టర్‌కు సిఫార్సు చేశారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగి కావడంతో కలెక్టర్ తదుపరి చర్యలను సూచిస్తారని డీఈవో డి.సుభద్ర తెలిపారు.

క్లుప్తంగా

బత్తులకు వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ



బత్తులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డిని తాడేపల్లిలోని నివాసంలో రాజ్యసభ సభ్యుడు అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, మాజీ ఎంపీ, గుంటూరు, పల్నాడు జిల్లాల కోఆర్డినేటర్ మోదుగుల వేణుగోపాలరెడ్డి, ఆగ్రో రీజినల్ మేనేజర్ సుధాకరరెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

తెలంగాణ డీఎస్సీలో మార్కాపురం విద్యార్థిని ప్రతిభ



సయ్యద్ రహీమున్

మార్కాపురం: మంగళవారం ప్రకటించిన తెలంగాణ డీఎస్సీ ఫలితాల్లో తర్లుపాడుకు చెందిన సయ్యద్ రహీమున్ సత్తా చాటింది. ఎస్‌జీటీ ఉర్దూ నాన్‌లోకల్ విభాగంలో 66.17 శాతం మార్కులతో నల్గొండ జిల్లాలో 2వ ర్యాంకు సాధించింది. మార్కాపురం పట్టణంలోని రైజ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందిన ఆమెను సంస్థ డైరెక్టర్లు డి.వినోద్‌కుమార్, ఎస్‌కే నిరంజన్, సిబ్బంది, స్నేహితులు, తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు.

మద్యం దుకాణాలకు 1472 దరఖాస్తులు

ఒంగోలు టౌన్: జిల్లాలోని 171 మద్యం దుకాణాలకు గాను మంగళవారం రాత్రి వరకు మొత్తం 1472 దరఖాస్తులు వచ్చాయి. ఒంగోలు డివిజన్‌లోని ఒంగోలు నగరం, రూరల్ కలిపి 34 దుకాణాలు ఉండగా 235 దరఖాస్తులు దాఖలయ్యాయి. చీమకుర్తి పరిధిలోని 16 దుకాణాలకు 182, సింగరాయకొండ పరిధిలో 14 మద్యం దుకాణాలకు 205, పొదిలిలోని 16 షాపులకు 83, దర్శిలోని 23 దుకాణాలకు గాను 132 దరఖాస్తులు వచ్చాయి. ఒంగోలు డివిజన్‌లోని 103 మద్యం దుకాణాలకు 837 మంది దరఖాస్తు చేసుకున్నారు. మార్కాపురం డివిజన్‌లోని మార్కాపురంలో 13 మద్యం దుకాణాలకు 165 దరఖాస్తులు, కనిగిరి లోని 19 దుకాణాలకు 165, గిద్దలూరులోని 13 మద్యం దుకాణాలకు 108, కంభంలోని 10 దుకాణాలకు 107, యర్రగొండపాలెంలోని 13 దుకాణాలకు 90 దరఖాస్తులు వచ్చాయి. మార్కాపురం డివిజన్‌లోని మొత్తం 68 దుకాణాలకు గాను 635 మంది దరఖాస్తు చేసుకున్నారు. పొదిలి, దర్శిలో రెండు చొప్పున సింగిల్ దరఖాస్తులు రాగా, కనిగిరిలో ఒక సింగిల్ దరఖాస్తు వచ్చింది.

కంభాలపాడులో కొండచిలువ కలకలం



నెట్‌లో ఇరుక్కున్న కొండచిలువ

పొదిలి: నగర పంచాయతీ పరిధిలోని కంభాలపాడులో భారీ కొండ చిలువ కలకలం రేపింది. పొలాల్లో నుంచి నివాసాల మధ్యకు వచ్చిన కొండ చిలువను చూసి స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో కొండచిలువను పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

సిద్ధవరంలో సినీ షూటింగ్ సందడి



సినిమా కోసం వేసిన సెట్

కొనకనమిట్ల: ఎంఆర్ క్రియేషన్స్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్న 'భీమ్ భూమికి జై' సినిమా సన్నివేశాలను కొనకనమిట్ల మండలంలోని సిద్ధవరం గ్రామ పరిసర ప్రాంతాల్లో రెండు రోజులుగా చిత్రీకరిస్తున్నారు. ప్రత్యేకంగా గుడిసెల సెట్టింగ్ వేసి సన్నివేశాలు తెరకెక్కిస్తున్నారు. మరో 20 రోజుల పాటు పరిసర ప్రాంతాలలో షూటింగ్ చేస్తామని చిత్ర బృందం తెలిపింది. కిరణ్, శుభశ్రీ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి సందీప్ దర్శకత్వం వహిస్తున్నారు. పొదిలి మండలం మూగచింతల గ్రామానికి చెందిన బండారు సుబ్బయ్య మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు. షూటింగ్‌ను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలిరావడంతో లొకేషన్‌లో సందడి నెలకొంది.

పేదల గూటి ఘోష.. కూటమికి తమాషా!

"సెంటు, సెంటున్నర స్థలం ఏం చేసుకోవడానికి? సమాధి కట్టుకోవడానికా? టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదలందరికీ మూడు సెంట్ల ఇంటి స్థలం కేటాయిస్తాం. పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తాం" ఇవీ సార్వత్రిక ఎన్నికల ముందు నారా చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలు. టీడీపీ, జనసేన నాయకులైతే చంద్రబాబు కంటే ఓ అడుగు ముందుకేసి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అనర్హులకు ఇళ్లు ఇచ్చారు, ఆ స్థలాలన్నీ వెనక్కి తీసుకుంటామని పేదలను భయభ్రాంతులకు గురిచేశారు. మరో వైపు మూడు సెంట్ల స్థలంలో లంకంత కొంప నిర్మించుకోవచ్చన్నట్లుగా సాగింది ఆనాటి ప్రచారం. కట్ చేస్తే.. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి నాలుగు నెలలవుతోంది. ఇళ్ల నిర్మాణంపై ఉన్నత స్థాయిలో ఓ సమీక్ష లేదు.. కనీసం లబ్ధిదారులతో సమావేశాలు కూడా నిర్వహించలేదు. గత ప్రభుత్వంలో జిల్లాలో అర్హులైన పేదలు నిర్మించుకున్న గృహాలకు బిల్లులు మంజూరు చేయకుండా ప్రభుత్వం కొర్రీ వేయడంతో లబోదిబోమంటున్నారు. – మార్కాపురం



మార్కాపురంలో మధ్యలోనే ఆగిన గృహాలు

- టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటై 4 నెలలైనా మంజూరు కాని ఇళ్లు
- లబ్ధిదారుల ఇంటి నిర్మాణ సాయంపై కూడా వివక్షే..
- గత ప్రభుత్వంలో అర్హులైన పేదలకూ మొండిచేయి

నాడు – అర్హతే ప్రామాణికం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇల్లు లేని పేద, మధ్య తరగతి ప్రజలు గ్రామ/వార్డు సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం వెంటనే మంజూరు చేసింది. దీంతో జిల్లాలో వేలాది మంది పేదలకు లబ్ధి చేకూరింది. జగనన్న కాలనీల్లో మహిళల పేరున ఇంటి పట్టాలు మంజూరు చేయడంతోపాటు ఇంటి నిర్మాణం కూడా వేగంగా చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. ఆర్థిక సమస్యలతో మధ్యలోనే ఇంటి నిర్మాణం ఆగిపోకూడదనే ఉద్దేశంతో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్యాంకర్లతో మాట్లాడి రుణాలు కూడా మంజూరు చేయించారు.

నేడు – అగమ్యగోచరం

కూటమి ప్రభుత్వం వచ్చి 120 రోజులైనప్పటికీ ఒక్క ఇంటిని కూడా మంజూరు చేయలేదు. మీకోసం కార్యక్రమంలో ఇళ్లు కావాలని వందలాదిగా అర్జీలు వస్తున్నప్పటికీ గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ అధికారులు కిమ్మనడం లేదు. స్థలాలు, ఇళ్ల మంజూరుపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో అధికారులు కూడా అర్జీలు తీసుకుని కట్టకట్టి పక్కన పెట్టేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇళ్ల నిర్మాణానికి అందించే సాయాన్ని కేంద్ర ప్రభుత్వం రూ.4 లక్షలకు పెంచడంతో కొత్త వారు ఆశగా ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వంలో గృహ నిర్మాణాన్ని ప్రారంభించి ఆర్థిక సమస్యలతో పనులు ఆపేసిన వారు తమకు కూడా సాయాన్ని పెంచాలని అర్జీల రూపంలో మొర పెట్టుకుంటున్నా వారి ఘోష పాలకుల చెవికెక్కడం లేదు.

వైఎస్సార్ సీపీ హయాంలో గృహాల మంజూరు ఇలా..

జిల్లాలో ఒంగోలు, కనిగిరి, మార్కాపురం గృహ నిర్మాణ శాఖ డివిజన్లు ఉన్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మొత్తం 63,279 గృహాలను మంజూరు చేసింది. ఇందులో మార్కాపురం డివిజన్‌లో 19,482 గృహాలు, ఒంగోలు డివిజన్‌లో 31,179, కనిగిరి డివిజన్‌లో 12,618 గృహాలు ఉన్నాయి. వీటిలో 21,550 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా, 15,925 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి. ప్రారంభించి మధ్యలో ఆపేసినవి, అసలు ప్రారంభించనివి 25,804 గృహాలు ఉన్నాయి. సిమెంట్, ఇసుక, ఇనుము ధరలు పెరిగిన నేపథ్యంలో ఇళ్ల నిర్మాణానికి అందిస్తున్న సాయాన్ని పెంచి ఇవ్వాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



గాంధీరోడ్డులోని కన్యకాపరమేశ్వరీదేవి



గొడుగుపాలెంలో కనకదుర్గాదేవి



కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలోని అన్నపూర్ణదేవి

ధనమైన పూజలమ్మో.. దుర్గమ్మా..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆరో రోజు మంగళవారం ఒంగోలులోని వివిధ ఆలయాల్లో అమ్మవారి ఉత్సవమూర్తులను శ్రీమహాలక్ష్మీదేవిగా కరెన్సీ నోట్లతో శోభాయమానంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

– సాక్షి ఒంగోలు



లాయరుపేట సాయిబాబా ఆలయంలో రాజరాజేశ్వరీదేవి



బాలాజీరావుపేటలోని కనకదుర్గాదేవి



గంటాపాలెం పార్వతీదేవి అమ్మవారు

పంగోలిన్ విక్రయం కేసులో నిందితులు అరెస్టు

పెద్దదోర్నాల: పంగోలిన్‌ను విక్రయించేందుకు సిద్ధమైన నిందితుల ముఠాలో ముగ్గురిని అటవీశాఖ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. పెద్దదోర్నాల ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షల అనంతరం నిందితులను అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. కేసు వివరాలను ఇన్‌చార్జి సెక్షన్ అధికారి మునీర్‌బాబు విలేకరులకు వెల్లడించారు. పెద్దదోర్నాల మండలానికి చెందిన మండ్లా పెద్దన్న, మండ్లా బాబూరావు, చాట్ల దానమయ్య, కుడుముల బయ్యన్న, దాసరి బుడ్డన్న పంగోలిన్‌ను సేకరించి విక్రయానికి పెట్టిన కేసులో నిందితులుగా ఉన్నారు. వారిలో కుడుముల బయ్యన్న, దాసరి బుడ్డన్న పరారీలో ఉన్నారు. పంగోలిన్‌ను కొంత మంది దళారుల ద్వారా నిందితులు అమ్మకానికి పెట్టారన్న సమాచారంతో ఈ నెల 5వ తేదీన చిన్నగుడిపాడు సమీపంలోని ఆర్టీటీ కార్యాలయం వద్ద పెద్దన్న, బాబురావు, దానమయ్యను అదుపులోకి తీసుకుని విచారించారు. అయితే పంగోలిన్ ప్రస్తుతానికి దొరకలేదని, దాని కోసం గాలిస్తున్నామని చెప్పారు. మిగిలిన ఇద్దరినీ అదుపులోకి తీసుకుని పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. నిందితులను మార్కాపురం కోర్టులో హాజరుపరిచేందుకు మార్కాపురం తరలిస్తున్న సమయంలో అటవీశాఖ కార్యాలయం వద్దకు చేరుకున్న బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.



అటవీశాఖ కార్యాలయంలో గుమిగూడిన నిందితుల బంధువులు

ఆటో డ్రైవర్‌పై పాత నేరస్తుడి దాడి

ఒంగోలు టౌన్: నగరానికి చెందిన ఓ ఆటోడ్రైవర్‌పై పాత నేరస్తుడు ఒకరు దాడి చేసిన సంఘటన స్థానిక పాత కూరగాయల మార్కెట్ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని అన్నవరప్పాడు 5వ లైనుకు చెందిన ఉంగరాల సాయి కృష్ణ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. మంగళవారం తెల్లవారుజామున జీజీహెచ్ దగ్గర ఇద్దరు ప్యాసింజర్లను ఆటో ఎక్కించుకుని పాత కూరగాయల మార్కెట్ సమీపంలోని టీ స్టాల్ దగ్గరకు వచ్చాడు. అక్కడ నగరానికి చెందిన పాత నేరస్తుడు హరిష్, జాన్సన్, అగస్టీన్ ఆటోకు అడ్డుగా నిల్చుని గొడవ పెట్టుకున్నారు. తనను వెళ్లనివ్వాలని ఆటో డ్రైవర్ బతిమాలుతున్నా వినకుండా ముఖం మీద పిడి గుద్దులు గుద్దారు. కర్రలతో తలపై కొట్టి గాయపరిచారు. గొంతు నొక్కి ఊపిరాడకుండా చేస్తున్న క్రమంలో స్థానికులు వారించడంతో నిందితులు వెళ్లిపోయారు. అపస్మారక స్థితిలో పడి ఉన్న సాయి కృష్ణను బంధువైన తన్నీరు రామకృష్ణ గమనించి సపర్యలు చేశాడు. కాగా నిందితుడు హరిష్‌పై తాలుకా పోలీసు స్టేషన్‌లో అనేక కేసులు ఉన్నట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ నాగరాజు తెలిపారు.

బంగారం షాపులో పర్సు మాయం

ఒంగోలు టౌన్: వెండి పట్టీలు కొందామని బంగారం దుకాణానికి వెళ్తే పర్సు పోయిందని ఓ మహిళ మంగళవారం స్థానిక వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత మహిళ కథనం ప్రకారం.. మద్దిపాడు మండలం అయ్యపురాజుపాలెం గ్రామానికి చెందిన గుట్లపల్లి ఆదిలక్ష్మి, కూతురు తేజస్వినితో కలిసి వెండి పట్టీలు కొనడానికి సోమవారం ఒంగోలు వచ్చారు. ఒంగోలులోని సుజాత నగర్‌లో నివసించే తమ్ముడి భార్య మల్లీశ్వరి, ఆమె కూతురు ఉదయలక్ష్మితో కలిసి గాంధీ రోడ్డులోని ఓ బంగారం దుకాణానికి వెళ్లారు. వెండి పట్టీలు చూస్తూ చేతిలోని పర్సును పక్కన కుర్చీ మీద పెట్టారు. కాసేపటి తర్వాత పాత పట్టీలు తీసిచ్చేందుకు ప్రయత్నించగా పర్సు కనిపించలేదు. అందులో రూ.25 వేల నగదు, రెండు జతల వెండి పట్టీలు, మూడు వెండి ఉంగరాలు, ఒక జత వెండి కమ్మలు ఉన్నాయని బాధితురాలు వాపోయింది. దుకాణం యజమానితో సహా సిబ్బంది అంతా దుకాణంలో వెతికినా పర్సు కనిపించలేదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఒన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

హవ్వ.. ముడుపులిస్తేనే బదిలీలా?

- పంచాయతీరాజ్ శాఖలో బదిలీలు, డిప్యుటేషన్లలో భారీగా అవినీతి
- డీపీఓ అక్రమ బాగోతంపై సీబీసీఐడీతో విచారణ జరపాలి
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన్ మాదిగ డిమాండ్



మాట్లాడుతున్న సుజన్

ఒంగోలు సిటీ: జిల్లా పంచాయతీరాజ్ శాఖలో బదిలీలు, డిప్యుటేషన్లకు భారీగా ముడుపులు పుచ్చుకుంటున్నారని, ఆ శాఖను అవినీతిమయంగా మార్చిన డీపీఓపై చర్యలు తీసుకోవాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన్ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇన్‌చార్జి డీపీఓ అవినీతిని తీవ్ర స్థాయిలో ఎండగట్టారు. బదిలీలకు దరఖాస్తు చేసుకున్న వారికి భేషరతుగా నియామక పత్రాలు ఇవ్వకపోతే డీపీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఇన్‌చార్జ్ డీపీఓగా వ్యవహరిస్తున్న మహిళా అధికారి కార్యాలయంలో కీలక ఉద్యోగులతో కోటరీ ఏర్పాటు చేసి డబ్బు దండుకోవడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. సీఎం చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ అవినీతి రహిత పరిపాలన అందిస్తామని చెబుతున్నారు కానీ ప్రకాశం భవనంలో మాత్రం డీపీఓ కార్యాలయం మాత్రం అక్రమాలకు నిలయంగా మారిందని ఆరోపించారు. ప్రతి బదిలీకి వారి ఉద్యోగానికి తగ్గట్టుగా రేటు నిర్ణయించి వసూలు చేస్తున్నారని, ఎవరైనా ప్రశ్నిస్తే రూల్స్ పేరుతో వేధించడం పరిపాటిగా మారిందని ధ్వజమెత్తారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి బదిలీకి రూ.20 వేలు, సచివాలయ ఉద్యోగులకైతే రూ.10 వేలు వసూలు చేస్తున్నారని, డీపీఓ అవినీతిపై సీబీసీఐడీతో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్యాంట్‌లో సెల్‌ఫోన్ పేలి తీవ్రగాయాలు

- క్షతగాత్రుని పరామర్శించిన వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్



క్షత గాత్రున్ని పరామర్శిస్తున్న దద్దాల నారాయణ యాదవ్, కస్తూరిరెడ్డి

కనిగిరి రూరల్: ప్యాంటు జేబులో ఉన్న సెల్‌ఫోన్ పేలి వ్యక్తి కాలికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే కనిగిరి మండలంలోని బుడ్డాయపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కుమ్మకుంట బాబు ప్యాంట్ జేబులో స్మార్ట్‌ఫోన్ పెట్టుకుని ఉండగా ఆదివారం ప్రమాదవశాత్తు పేలింది. దీంతో కే బాబు రెండు కాళ్ల తొడలు కాలి తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చేరి చికిత్సలు చేయించుకుని అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న క్షతగాత్రుడు కుమ్మరికుంట బాబును మంగళవారం వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పరామర్శించారు. ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, సర్పంచ్‌లు నీలం రమణయ్య, కుంట సౌందర్య రవి, హజరత్‌రెడ్డి తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

మద్దిపాడు: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన సోమవారం అర్ధరాత్రి ఏడుగుండ్లపాడు సమీపంలో జాతీయరహదారిపై చోటుచేసుకుంది. వివరాలు.. సోమవారం అర్ధరాత్రి సమయంలో ఐషర్ షోరూమ్ ఎదురుగా గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందడంతో మద్దిపాడు ఎస్సై శివరామయ్యకు స్థానికులు సమాచారం అందించారు. ఆయన మృతదేహాన్ని పరిశీలించి ఒంగోలు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతి చెందిన వృద్ధుని వయసు సుమారు 65 నుంచి 70 ఏళ్ల మధ్య ఉంటుందని, ఆచూకీ తెలిసిన వారు సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని మూడు రోజుల వరకు మార్చురీలోనే ఉంచుతామని స్పష్టం చేశారు.

చికిత్స పొందుతూ హెడ్ కానిస్టేబుల్ మృతి



హెడ్ కానిస్టేబుల్ జయరావు భౌతికకాయానికి గౌరవ వందనం చేస్తున్న ఏఎస్పీ అశోక్‌బాబు

టంగుటూరు: టంగుటూరు పోలీసు స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ జి.జయరావు(61) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందారు. ఎస్సై నాగమల్లేశ్వరరావు కథనం మేరకు.. విధి నిర్వహణలో భాగంగా హెడ్ కానిస్టేబుల్ జయరావు తన ద్విచక్రవాహనంపై కొణిజేడు గ్రామం నుంచి ఒంగోలు వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. హెడ్ కానిస్టేబుల్ భౌతికకాయానికి ఏఎస్పీ అశోక్‌బాబు, ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సింగరాయకొండ సీఐ చావా హజరత్తయ్య, టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు, పలువురు పోలీసు అధికారులు పూలమాలలు వేసి గౌరవ వందనం చేశారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు తీవ్ర అస్వస్థత



అస్వస్థతకు గురైన కానిస్టేబుల్ రవికుమార్

కనిగిరి రూరల్: విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన మంగళవారం కనిగిరిలో చోటుచేసుకుంది. వివరాలు.. కనిగిరి పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ బి.రవికుమార్ స్థానికంగా ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా నోటి నుంచి నురుగు కక్కుతూ కింద పడిపోవడంతో స్థానికులు, తోటి కానిస్టేబుళ్లు స్పందించి కనిగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హై బీపీ వచ్చి తీవ్ర అస్వస్థతకు గురైన రవికుమార్‌ను మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్నట్లు ఎస్సై టి.శ్రీరాం తెలిపారు. కానిస్టేబుల్ రవి కుమార్‌కు కిడ్నీ సమస్య కూడా ఉన్నట్లు తెలిసింది.